ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

మంగళవారం 10 డిసెంబరు 2024

మంత్రి మిమిక్రీ

- ప్రతిపక్ష నేత గొంతు అనుకరించిన దురైమురుగన్
- మాట్లాడేందుకు ఏమీ లేకనే ఇలాంటి చేష్టలు
- మంత్రికి ఈపీఎస్ చురకలు



శాసనసభకు వస్తున్న ఈపీఎస్ బృందం

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ సోమవారం శాసనసభలో ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) గొంతును అనుకరిస్తూ మిమిక్రీ చేయడం సభలో కొంత సేపు చర్చనీయాంశమైంది. అదే సమయంలో ఈ మిమిక్రీపై ఈపీఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ మంత్రి దగ్గర మాట్లాడేందుకు ఎలాంటి అంశాలు లేకపోవడం వల్లే ఇలా మిమిక్రీ చేశారని, బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ఇలా సభలో ప్రవర్తించటం గర్హనీయమని ఈపీఎస్ చురకలంటించారు. శాసనసభలో టంగ్‌స్టన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై ఈపీఎస్ మాట్లాడుతూ .. ఈ తీర్మానంలో సమగ్రమైన వివరాలు లేవని, పార్లమెంట్‌లో ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా డీఎంకే ఎంపీలు ఆరంభంలోనే అడ్డుకోవాల్సిందన్నారు. ఆ సమయంలో మంత్రి దురైమురుగన్ లేచి ఈపీఎస్‌ని అనుకరిస్తూ ఆయనలాగే చేతులూపుతూ మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షనేత ఈపీఎస్ ప్రతివిషయాన్ని ఆగ్రహావేశాలతో ఊగిపోతూ మాట్లాడుతున్నారని, తాను కూడా ఆయనలాగే ఆగ్రహంగా మాట్లాడితే తట్టుకోలేరన్నారు. మంత్రి దురైమురుగన్ వద్ద మాట్లాడేందుకు సరకు (విషయాలు) లేకపోవడం వల్లే ఇలా తనను అనుకరిస్తూ మాట్లాడుతున్నారని ఈపీఎస్ అన్నారు. ఇలాంటి మిమిక్రీ బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానని, ప్రధాన సమస్యల కోసం ప్రాణమిచ్చేందుకు కూడా వెనుకాడబోమని ఈపీఎస్ ఉద్వేగంగా ప్రకటించారు.

‘టంగ్‌స్టన్’ అమలైతే

సీఎం పదవికి రాజీనామా

- అసెంబ్లీలో స్టాలిన్ సంచలన ప్రకటన
- ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం



టంగ్‌స్టన్ ప్రాజెక్టు వ్యతిరేక తీర్మానంపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపంలో టంగ్‌స్టన్ ప్రాజెక్టు అమలైతే తన పదవికి రాజీనామా చేసేందుకు కూడా వెనుకాడబోనని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం అనుమతివ్వడాన్ని ఖండిస్తూ సోమవారం అసెంబ్లీలో నీటివనరులశాఖ మంత్రి దురైమురుగన్ ఓ ప్రత్యేక తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆ సందర్భంగా అన్ని పార్టీల సభ్యులు ఆ ప్రాజెక్టును అనుమతించకూడదని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మాట్లాడుతూ పది నెలల క్రితమే టంగ్‌స్టన్ సొరంగం తవ్వకాలకు వేలంపాట జరిగినా డీఎంకే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించిందని ఆరోపించారు. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాతే ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాశారని, ఇది ప్రజల ప్రధాన సమస్య అని పేర్కొన్నారు. టంగ్‌స్టన్ తవ్వకాలకు వేలం జరిగిన పది నెలల పాటు పాలకపక్షం ఎందుకు కాలయాపన చేసిందో స్పష్టం చేయాలని ఈపీఎస్ పట్టుబట్టారు. రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి అన్నదాతలకు తీరని నష్టాన్ని కలిగించే టంగ్‌స్టన్ ప్రాజెక్టును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చేసిన ప్రత్యేక తీర్మానాన్ని అన్నాడీఎంకే సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తారని ప్రకటించారు.

తాను సీఎంగా ఉన్నంత వరకూ....

టంగ్‌స్టన్ సొరంగం తవ్వకాలను వ్యతిరేకిస్తూ తాము ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రధాన ప్రతిపక్ష నేత చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. పార్లమెంట్‌లో డీఎంకే ఎంపీలు ఆ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించిన విషయం ఈపీఎస్‌కు తెలియకపోవటం శోచనీయమన్నారు.. తాను కూడా కేంద్రానికి లేఖ రాశానని వివరించారు. పార్లమెంట్‌లో డీఎంకే ఎంపీలు సభను స్తంభింపజేసేలా పలు మార్లు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారని, ఈ ప్రాజెక్టు వివరాలు వెల్లడైనప్పుడే తమ పార్టీసభ్యులంతా తీవ్ర వ్యతిరేకతను సభాముఖంగా ప్రకటించారన్నారు. టంగ్‌స్టన్ పథకాన్ని అడ్డుకుని తీరుతామని, ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమన్నారు. తాను సీఎంగా ఉన్నంత వరకూ టంగ్‌స్టన్ ప్రాజెక్టు అనుమతించే ప్రసక్తే లేదని స్టాలిన్ ఉద్వేగంగా పేర్కొన్నారు. టంగ్‌స్టన్ ప్రాజెక్టు వస్తే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సోనియాకు సీఎం బర్త్‌డే విషెస్

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పూర్వ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీకి ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఎన్నో కష్టతరమైన సవాళ్ళను అధికమించి ఆమె ప్రయాణం ముందుకుసాగాలని, ఆమె తలపెట్టే పనిలో విజయాన్ని అందుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో ముందుకుసాగాలని ఆకాంక్షిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ముందువరుసలో ఉదయనిధి

- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రికి తగిన ప్రాధాన్యం



అసెంబ్లీలో సీఎం స్టాలిన్, మంత్రి దురైమురుగన్‌తో పాటు ముందు వరుస మూడో స్థానంలో ఉదయనిధి

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో స్పీకర్ అప్పావు సూచనల మేరకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి ముందు వరుసలో మూడో నెంబరు సీటు కేటాయించారు. 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉదయనిధి చేపాక్- ట్రిప్లికేన్ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. ఆ సమయంలో పాలకపక్షం సభ్యులున్న సీట్ల వరుసలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వెనుక మూడో వరుస సీటులో ఉదయనిధి కూర్చున్నారు. ఆ తరువాత ఆయన యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రిగా ముఖ్యమంత్రి స్టాలిన్ కూర్చునే ముందువరుస సీట్లలో పదో సీటులో కూర్చున్నారు. సెప్టెంబర్‌లో ఉదయనిధి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు మంత్రివర్గంలో మూడో హోదా లభించింది. అదే రీతిలోనే శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్, సీనియర్ మంత్రి దురైమురుగన్ తర్వాతి సీటులో ఉదయనిధి ఆశీనులయ్యారు.

మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులకు నివాళి..

శాసనసభ శీతాకాలపు సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాల మొదటి రోజు సోమవారం ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమైంది. స్పీకర్ అప్పావు తిరుక్కురళ్‌లోని ఓ సూక్తిని చదివి దాని తాత్పర్యం తెలిపారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యేలు మహమ్మద్ ఘనీ, జయరామన్, తంగవేల్ రాజ్, సి.గణేశన్, కే రమేష్, సి. షణ్ముగం, గుమ్మిడిపూండి కే సుందరం, ఆర్ రామచంద్రన్, ఎన్.బాలసుబ్రమణియన్, దండపాణి, కే సెల్వరాజ్, కోదండం, మార్గరెట్ ఎలిజబెత్ బ్రిక్స్, సుబ్బరాయర్ మృతికి స్పీకర్ సంతాపం ప్రకటించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు సహా సభ్యులందరూ లేచి మాజీ సభ్యుల మృతికి సంతాపసూచకంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య, మాజీ సైన్యాధ్యక్షుడు ఎస్.పద్మనాభన్, సీపీఎం జాతీయకమిటీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా, ఈసీఐ చర్చి బిషప్ ఎస్రా సర్గుణం, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పి.శంకర్, పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎండీఆర్.రామచంద్రన్, మురసోలి పత్రిక సంపాదకుడు మురసోలి సెల్వం మృతికి స్పీకర్ అప్పావు సంతాప తీర్మానం చేశారు. ఆ సందర్భంగా సభ్యులందరూ లేచి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

పుదుచ్చేరిలో కేంద్ర బృందం

రెండో రోజూ వరద బాధిత ప్రాంతాల పరిశీలన



చెట్టిపట్టు ప్రాంతంలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పుదుచ్చేరి, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన పుదుచ్చేరిలో కేంద్రబృందం రెండో రోజైన సోమవారం కూడా పర్యటించింది. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పుదుచ్చేరి తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగస్వామి కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో తమ రాష్ట్రంలో వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్ర బృందాల్ని పంపించాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్రం, కేంద్ర విపత్తుల నిర్వాహణ శాఖా ఉప కార్యదర్శి రాజేష్ గుప్తా నేతృత్వంలోని బృందం ఆదివారం మధ్యాహ్నం పుదుచ్చేరి వచ్చింది. వారు రెండు బృందాలుగా విడిపోయి సోమవారం వరకు విల్లియనూర్, కాలాపట్టు, లాస్‌పేట, పిల్లైచావడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు.. అనంతరం సోమవారం పుదుచ్చేరి సచివాలయంలో సీఎం రంగస్వామి, మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమై వరద నష్టంపై చర్చించారు.

టంగ్‌స్టన్ ప్రాజెక్ట్ లైసెన్స్ రద్దుపై

కేంద్రం పరిశీలన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



ప్యారీస్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అరిటాపట్టిలో హిందూస్థాన్ జింక్ సంస్థకు టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇచ్చిన లైసెన్స్ రద్దు చేయడంపై కేంద్రప్రభుత్వం పరిశీలిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. టంగ్‌స్టన్ వ్యవహారంపై, ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, మదురై అరిటాపట్టి, నాయకన్‌పట్టి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను తీవ్రంగా ఆక్షేపిస్తూ ఆందోళనలు చేపడుతున్న విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డికి తెలియజేయడంతో పాటు ఆ ప్రాజెక్టును వెనక్కి తీసుకోవాలని తాను కూడా వ్యక్తిగతంగా కోరానని వివరించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్ట్‌కు ఇచ్చిన లైసెన్స్‌ను రద్దు చేయడంపై పరిశీలించి, నిర్ణయం వెల్లడిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

ఆదవ్ అర్జున్‌పై సస్పెన్షన్ వేటు



సచివాలయంలో తుఫాన్ బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు డీపీఐ తరపున రూ.10లక్షల విరాళం అందజేస్తున్న తొల్‌తిరుమావళవన్

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ ప్రముఖ తమిళ పత్రిక ఆధ్వర్యంలో ఏర్పాటైన అంబేడ్కర్ పుస్తకావిష్కరణలో పార్టీకి విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్‌ను ఆ పార్టీ నేత తొల్‌తిరుమావళవన్ ఆరునెలలపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్ పాల్గొన్న ఆ సభలో ఆదవ్ అర్జున్ డీఎంకే పాలనపై పరోక్షంగా విమర్శలు చేశారు. దీంతో ఆయనను పార్టీ నుండి తొలగించటం ఖాయమని అందరూ అనుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను నెలల పాటు పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ఈ ప్రకటన తర్వాత డీపీఐ నేత తొల్‌తిరుమావళవన్ సచివాలయంలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌ను కలుసుకున్నారు. పార్టీ తరఫున తుఫాను బాధితుల కోసం రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం అసెంబ్లీ వెలుపల తిరుమావళవన్ మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ పుస్తకావిష్కరణ సభలో రాజకీయాలు గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, పుస్తకంలోని అంశాలు, అంబేద్కర్ కీర్తి ప్రతిష్టతలు గురించి మాత్రమే మాట్లాడాలని తాను పదే పదే చెప్పిమరీ పంపానని, అయితే పార్టీని కించపరిచేలా, డీఎంకే కూటమిని విమర్శిస్తూ ప్రసంగించడం తమకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. అంతే కాకుండా గత కొంతకాలంలో సామాజిక ప్రసార మాధ్యమాల్లోనూ డీఎంకే కూటమికి వ్యతిరేకంగా విమర్శలు చేసి పార్టీని ఇరకాటంలో పెట్టారని, వీటన్నింటిని పరిశీలించినమీదట పార్టీపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుందనే భావంతోనే ఆదవ్ అర్జున్‌ను సస్పెండ్ చేశామన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు గత కొంతకాలంగా డీపీఐ ఆదవ్ అరున్ ఆధీనంలో ఉందా? లేక తిరుమావళవన్ ఆధీనంలో ఉందా? అంటూ పదే పదే విమర్శలు చేస్తున్నారని, బీజేపీ నేతలకు తాను కూడా ఇలాంటి ప్రశ్నే వేయాలని అనుకుంటున్నానని, ఆ ప్రకారం బీజేపీ అదానీ ఆధీనంలో ఉందా? లేక మోదీ ఆధీనంలో ఉందా? అనే ప్రశ్నకు బదులివ్వాలన్నారు.



ఆదవ్ అర్జున్

కొచ్చిన్ వెళ్లే విమానంలో సాంకేతిక లోపం

- 117 మంది ప్రయాణికులకు తప్పిన ముప్పు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం జాతీయ విమానాశ్రయం నుంచి కేరళలోని కొచ్చిన్‌కు బయలుదేరిన విమాన ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానం మళ్లీ మీనాంబాక్కంలో ల్యాండింగ్ అయ్యింది. సోమవారం ఉదయం 117 మంది ప్రయాణికులతో ఓ విమానం కొచ్చిన్ బయలుదేరింది. ఆకాశంలో ఎగురుతుండగా ఆ విమాన ఇంజన్‌లో సాంకేతిక లోపాన్ని పైలెట్ గుర్తించాడు. వెంటనే చెన్నై ఎయిర్‌పోర్టు కంట్రోలు రూమ్ అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో మళ్ళీ ఆ విమానాన్ని వెనక్కి మళ్ళించి ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయమని అధికారులు పైలెట్‌కు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు పైలట్ ఆ విమానాన్ని జాగ్రత్తగా మళ్ళీ మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌లో దింపాడు. ఆ తర్వాత ప్రయాణికులందరినీ దింపి రెస్ట్‌రూమ్‌లకు తరలించారు. పైలెట్ సకాలంలో సాంకేతిక లోపాన్ని గుర్తించటం వల్ల 117 మంది ప్రయాణికులకు ముప్పు తప్పినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు పేర్కొన్నారు.

విద్యా సంస్థల్లో కచేరీ చేస్తే 10 శాతం పన్ను

- కొత్త చట్టాన్ని ప్రవేశ పెట్టిన మంత్రి నెహ్రూ

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల ప్రాంగణాల్లో ప్రవేశ రుసుం వసూలు చేసి సంగీత కచేరిలు నిర్వహిస్తే 10 శాతం వినోదపు పన్ను వసూలు చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నగర పాలక సంస్థలు (మున్సిపాలిటీలు) - వినోదపు పన్ను వసూలు సవరణ చట్టాన్ని మంత్రి నెహ్రూ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల వినోదపు చట్టంలో కొన్ని ముఖ్యాంశాలున్నాయన్నారు. ప్రధానంగా వినోద కార్యక్రమాలకు పన్ను విధించడం, వసూలు చేయడం కోసం స్థానిక సంస్థలకు అధికారం ఇస్తుందన్నారు. అయితే, విద్యా సంస్థ ప్రాంగణంలో నిర్వహించే ఒక వినోద కార్యక్రమం లేదా, సంగీత విభావరి, నాటకం ఎలాంటి వినోద కార్యక్రమానికైనా ప్రవేశరుసుం వసూలు చేస్తే ఇప్పటివరకు వినోదపు పన్ను వసూలు చేసే విధానం లేదన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు అనుమతివ్వడంతో పాటు పది శాతం వినోదపు పన్ను వసూలు చేసే నిమిత్తం ఈ ముసాయిదా బిల్లును రూపొందించినట్టు సభకు తెలిపారు. ఈ చట్టం మేరకు ఇకపై విద్యా సంస్థ ప్రాంగణంలో నిర్వహించే సంగీత విభావరి వంటి వినోద కార్యక్రమాలకు పది శాతం పన్ను విధిస్తామన్నారు. అయితే, ఈ ముసాయిదా చట్టాన్ని అన్నాడీఎంకే సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

- రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సెల్వ పెరుందగై, తిరునావుక్కరసు తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వ పెరుందగై పార్టీ సీనియర్ నేత లు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సోనియా బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. పేదలకు సంక్షేమ సహాయాలు, విద్యార్థులకు కాంగ్రెస్ కమిటీ ట్రస్ట్ తరుపున ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వైద్యశిబిరం, నేత్రపరీక్షా శిబిరాల ను ఆయన ప్రారంభించారు. ఈ వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రులు తిరునావుక్కరసు, తంగబాలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా కాంచీపురం, చెంగల్‌పట్టు, విల్లుపురం సహా అన్ని జిల్లాలలో పార్టీ నేతలు కాంగ్రెస్ జెండాలు ఎగరవేసి ఆలయాల్లో సోనియా గాంధీ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేయించారు. కాంగ్రెస్ మైనారిటీ విభాగంలో ఆధ్వర్యంలో చర్చిలు, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వచ్చే ఏడాది మదురై ఆలయ మహా కుంభాభిషేకం

- మంత్రి పీకే శేఖర్ బాబు

ప్యారీస్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి అమ్మవారి ఆలయానికి వచ్చే ఏడాది డిసెంబర్‌లో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు హిందూ దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్ బాబు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశంలో సోమవారం ఉదయం మాజీ మంత్రి సెల్లూర్ రాజు మదురై మహాకుంభాభిషేకం గురించి ప్రశ్నించగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ ప్రాంగణంలోని వీర వసంతరాయర్ మండపంలో 2018లో సంభవించిన అగ్ని ప్రమాదంలో మండపం దెబ్బతిందని దీని పునఃరుద్ధరణకు 25 అడుగుల పొడవైన రాతి స్తంభాల తయారీకి ప్రభుత్వం నుంచి ఇటీవల అనుమతి వచ్చినట్లు తెలిపారు. రాతి స్తంభాల కొనుగోలుకు సంబంధించి రూ.19 కోట్లతో టెండర్లు ఆహ్వానించి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని మంత్రి శేఖర్ బాబు వివరించారు. మీనాక్షి అమ్మవారి ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధారణ పనులు ఇప్పటి వరకు 63 పూర్తయ్యాయని, వీటిలో 40 పనులు ఉభయదారుల ద్వారా నెరవేర్చినట్లు తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఈ ఆలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు దేవాదాయ శాఖా నిర్ణయించిందని మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు.

సమాచార దర్శిని

నేడు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మంగళవారం జరుగనుంది. గ్రూప్-1 విభాగంలో 90 పోస్టులను టీఎన్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రిలిమినరీ పరీక్ష జూలై 13వ తేది నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మంగళవారం నుంచి 13వ తేది వరకు మెయిన్స్ నిర్వహించనున్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. కాగా, మంగళవారం పరీక్ష కట్టుదిట్టంగా నిర్వహించేలా టీఎన్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుచేశారు. సెల్‌ఫోన్, బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరీక్షా కేంద్రంలోని అనుమతించరు. నిబంధనలు అతిక్రమించే అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని టీఎన్‌పీఎస్సీ హెచ్చరించింది.

14న ప్రైవేట్ జాబ్ మేళా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలో ఈ నెల 14న ప్రైవేట్ జాబ్ మేళా జరుగనుంది. పొన్నియమ్మన్‌మేడు జీఎస్‌టీ రోడ్డు సమీపంలోని సెయింట్ బాలుర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 నుంచి జరుగనున్న ఈ శిబిరంలో ప్రైవేటు సంస్థలు తమకు అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి. 8,10,12, ఐటీఐ, ఇంజనీర్ కోర్సులు చేసిన వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

'నాన్ ముదల్వన్' పథకంలో డ్రైవింగ్ శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల కొరత తీర్చేలా 'నాన్ ముదల్వన్' పథకంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'నాన్ ముదల్వన్' పథకంలో లైట్, హెవీ వాహనాల డ్రైవింగ్ శిక్షణ 30 నుంచి 45 రోజుల పాటు ఇవ్వనున్నారు. 8,10, ప్లస్ టూ చదివి ఆసక్తి కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్, కాంచీపురం జిల్లా మరైమలై నగర్, తంజావూరు తదితర ప్రాంతాల్లో ఈ ఉచిత డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలున్నాయి. రాబోయే రోజుల్లో ఈ పథకాన్ని అన్ని జిల్లాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణకు సంబంధించిన వివరాలు 2025 జనవరి మొదటి, రెండో వారంలో వెల్లడించనున్నట్లు, ఆసక్తి కలిగిన వారు www.naanmudhalvan.tn.gov.in అనే వెబ్‌సైట్లో పేరు నమోదుచేసుకోవాలని అధికారులు సూచించారు.

యథావిధిగా సబర్బన్ రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య యథావిధిగా సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది. ఈ మార్గంలో మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారాల్లో ఆదివారం టైం టేబుల్ ప్రకారం తక్కువ సంఖ్యలో రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) చెన్నై బీచ్-తాంబరం, తాంబరం-చెంగల్పట్టు మధ్య ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ క్రమంలో, ఈ మార్గంలో సబర్బన్ రైళ్లు యథావిధిగా నడుస్తాయని అధికారులు తెలిపారు.

వెల్లయంగిరిపై మహాదీపానికి అనుమతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వెల్లయంగిరి కొండ ఆలయంపై వచ్చే సంవత్సరం జనవరి 14వ తేది నంద పూజ, మహాదీపం వెలిగించేందుకు మద్రాసు హైకోర్టు అనుమతించింది. వెల్లయంగిరి కొండ ఆలయంలో మహాదీపం, తిరుకల్యాణానికి అనుమతించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. శుక్రవారం ఈ పిటిషన్ విచారించి హైకోర్టు, కార్తీక దీపోత్సవాల సందర్భంగా మహా దీపం వెలిగించేందుకు అనుమతించింది. అలాగే, ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయంలో పూజలు నిర్వహించుకోవచ్చని న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై, అన్నానగర్, గిండి, పొన్నేరి ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లబాండ్ వీధిలోని విద్యుత్ కార్యాలయం, అన్నానగర్ పరిధిలో 11వ మెయిన్ రోడ్డు 5వ క్రాస్ వీధిలోని విద్యుత్ బోర్డు కార్యాలయం, గిండి పరిధిలో నంగనల్లూర్ హిందూ కాలనీ వందడుగుల రోడ్డు సమీపంలోని ఉన్న విద్యుత్ బోర్డు కార్యాలయం, పొన్నేరి పరిధిలో వెంబాక్కం టీహెచ్ రోడ్డులోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న శిబిరాల్లో వినియోగదారులు పాల్గొని, తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

బస్సుల్లో ప్లాస్టిక్ సీసాల నిషేధం

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నీలగిరి జిల్లాలో నడిచే ప్రభుత్వ బస్సుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు, పర్యాటక ప్రాంతాలు కలుషితం కాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. దుకాణాలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల విక్రయాలను నిషేధించారు. జిల్లాకు ప్రభుత్వ బస్సుల్లో వచ్చే పర్యాటకులు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ బాటిళ్లు తీసుకురాకూడదని నిషేధం విధించారు.

వేదారణ్యం తీరానికి బర్మా పడవ


సముద్రతీర భద్రతాదళం స్వాధీనం చేసుకున్న బర్మా పడవ

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపం పుష్పవనం జాలరి గ్రామ సమీపంలో సోమవారం ఉదయం మయన్మార్ (బర్మా)కు చెందిన పడవ తీరానికి కొట్టుకువచ్చింది. ఆ పడవ 40 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు కలిగి సుమారు 150కిపైగా వెదురుకర్రలతో తయారైంది. ఆ పడవలో చేపలవేటకు ఉపయోగించే రెండు బస్తాల కోడి దాణా కూడా ఉంది. ఈ పడవ తీరానికి కొట్టుకురాగానే స్థానిక జాలర్లు వేదారణ్యంలోని సముద్రతీర భద్రతాదళానికి ఫిర్యాదు చేశారు. సీఐ లోకనాథన్, ఎస్‌ఐలు వరలక్ష్మి, సుధాకర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని బర్మా పడవను స్వాధీనం చేసుకున్నారు. ఆ పడవలో బర్మాదేశీయులెవరైనా వచ్చారా అనే విషయంగా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యాసార్పాడి రౌడీపై పోలీసు కాల్పులు

● ఆసుపత్రికి తరలింపు

టి.నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యాసార్పాడికి చెందిన రౌడీ అరివళగన్‌పై సోమవారం వేకువజామున పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. రౌడీ అరివళగన్‌పై పలు పోలీసుస్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దారిదాపిడీ తదితర నేరాలకు సంబంధించిన కేసులన్నాయి. నగరంలో మామూళ్ల కోసం పలువురిపై దాడి చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల అరివళగన్ గంజాయి స్మగ్లింగ్, వ్యాపారం కూడా చేస్తున్నట్లు ప్రత్యేక పోలీసులకు సమాచారం అందింది. దీంతో అరివళగన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒట్టేరి పోలీసుస్టేషన్ పరిధిలోని పనంతోప్పు ప్రాంతంలో అరివళగన్ దాగి ఉన్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకుని రౌడీని అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంగా అరివళగన్ తన దగ్గరున్న మారణాయుధాలతో పోలీసులపై దాడికి పాల్పడటంతో ప్రేమ్‌కుమార్ కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో అరివళగన్ కాలికి గాయమైంది. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నగరంలో రెండు పాఠశాలలకు బాంబు బెదిరింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంజంబాక్కం, నీలాంగరై ప్రాంతాల్లోని రెండు ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు వచ్చింది. సోమవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా అందిన ఈ సమాచారాన్ని పాఠశాలల యాజమాన్యం పోలీసులకు తెలియజేసింది. పోలీసుల సూచనలతో రెండు పాఠశాలల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించి వేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, పాఠశాల, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, బాంబు బెదిరింపు వచ్చిన ఈ-మెయిల్ వివరాల కోసం విచారిస్తున్నారు.

16న రైతు సంఘాల రైల్‌రోకో

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరికి గిట్టుబాటు ధర కల్పించాలి, పంట రుణాలు రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న రైల్‌రోకో చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కావేరి రైతు సంఘాల సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో, పంట రుణాలు చెల్లించని రైతుల ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్న ప్రభుత్వం అదానీ సంస్థకు అప్పగిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని పొలాలు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకోలు చేపట్టనున్నట్లు రైతు సంఘం ప్రకటించింది.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లో వర్షపు నీటి కాల్వల నిర్మాణంలో సెంట్రింగ్ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వీరపెరుమాళ్ ఆలయ వీధిలో కాలువల నిర్మాణానికి సెంట్రింగ్ పనులు చేపట్టారు. ఈ పనుల్లో పాల్గొన్న మిలాన్‌దాస్ (19) విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. సహచారులు అతడిని వెంటనే రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

గంజాయి తరలింపు కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికి తలా పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మదురై జిల్లా కంభం ప్రాంతంలో 2023లో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా, జగదీశ్వరన్, శివన్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వాదోపవాదనలు పూర్తికావడంతో, ఇద్దరు నిందితులకు తలా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మదురై మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది.

16న మంత్రి పిటిషన్‌పై ఉత్తర్వులు

ఐసిఎఫ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోరెన్సికల్‌గా పరిశీలించిన డ్యాక్యుమెంటరీ డిజిటల్ కాపీ ఇవ్వాలని కోరుతూ మంత్రి సెంథిల్ బాలాజి పిటషన్ వేశారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 16న ఉత్తర్వులు జారీచేస్తామని మద్రాసు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు సోమవారం ప్రకటించింది. కాగా, ఈ పత్రాలు ఎంపీ, ఎమ్మెల్యేపై ఉన్న కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టు ఆధీనంలో ఉన్నందున, వాటి నకలు అందించడం సాధ్యం కాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోర్టుకు తెలియజేసింది.

విద్యుదుత్పత్తికి అంతరాయం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై థర్మల్ కేంద్రంలో నిర్వహణ పనుల కారణంగా 600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. అత్తిపట్టు పుదునగర్ సమీపంలో రెండవ కేంద్రంలోని 1వ యూనిట్‌లో మరమ్మతుల కారణంగా ఉత్పత్తి నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

జీఎస్టీపై వ్యాపారుల నిరసన

ఐసిఎఫ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రం విధించిన 18 శాతం జీఎస్టీ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ తిరుప్పూర్ వ్యాపారులు నిరసన తెలిపారు. అద్దె దుకాణాలకు 18 శాతం జీఎస్టీ, ఆస్తి పన్ను పెంపు తదితరాలకు నిరసనగా తిరుప్పూర్ వ్యాపారులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 18వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమ్మెకు వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం వ్యాపారులు తమ దుకాణాలకు నల్లజెండాలు కట్టి నిరసన తెలిపారు.

బస్సు నుంచి జారిపడిన మహిళ మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియపాళయంలో బస్సు నుండి జారిపడి మహిళ మృతిచెందింది. మలందూర్ భగత్‌సింగ్ వీధికి చెందిన ముత్తు-కవిత (40) దంపతులకు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కవిత తండ్రి ఇటీవల మృతిచెందాడు. సోమవారం ఆయన సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు కవిత, వెంగల్ నుంచి గుమ్మిడిపూండి బస్సులో ప్రయాణించింది. వెనుక సీట్లో కూర్చున్న ఆమె ముందు సీటు ఖాళీ కావడంతో, ఆ సీట్లోకి వెళ్లేందుకు లేవగా బస్సు వేగంగా వెళ్తుండడంతో అదుపుతప్పి ఫుట్‌బోర్డు మీదుగా కిందకు పడిపోయింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పెరియపాళయం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

15న అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం

● పోలీసు భద్రత కోరుతూ వినతి

ప్యారీస్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): స్థానిక వానగరంలోని శ్రీవారు కల్యాణ మండపంలో ఈ నెల 15న నిర్వహించనున్న అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశానికి పోలీసు భద్రత కోరుతూ గ్రేటర్ చెన్నై పోలీసు కమీషనర్ కార్యాలయంలో సోమవారం మాజీమంత్రి బెంజిమెన్ వినతి పత్రం అందించారు. ఆ పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన వచ్చే ఆదివారం సర్వసభ్య మండలి సమావేశం ప్రారంభంకానుంది. సమావేశం ఏర్పాట్లను మాజీ మంత్రి బెంజిమెన్ నేతృత్వంలో సిద్ధం చేశారు.

వరద సాయం కోసం రోడ్డెక్కిన 'ఫెంగల్' బాధితులు


సెంజి వద్ద రాస్తారోకో చేస్తున్న బాధితులు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా సెంజి వద్ద ఫెంగల్ తుఫాన్‌కు తీవ్రంగా నష్టపోయిన బాధితులు తమకు వరద సహాయాన్ని అందజేయాలని కోరుతూ సోమవారం ఉదయం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రస్తుతం సెంజి పంచాయతీ యూనియన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో అధికారులు ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయాన్ని అందజేస్తున్నారు. అయితే మేల్‌మలయనూరు పంచాయతీ యూనియన్ పరిధిలో వరదలకు నష్టపోయినవారికి ఆ సహాయాన్ని ఇంకా పంపిణీ చేయలేదు. ఈ నేపథ్యంలో మేల్‌మలయనూరు పంచాయతీ యూనియన్‌లోని చొక్కనందల్ గ్రామానికి చెందిన సుమారు వందమంది సెంజి - తిరువణ్ణామలై జాతీయ రహదారిలో సత్యమంగళం వద్ద రాస్తారోకో జరిపారు. ఈ విషయం తెలుసుకుని సత్యమంగళం సీఐ హరికృష్ణన్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరిపారు.

కోయంబేడు, పోరూర్ చెక్‌పోస్ట్ నుంచి ఆమ్నీ బస్సులు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దక్షిణ జిల్లాలకు వెళ్లే ఆమ్నీ బస్సులు కోయంబేడు డిపో, పోరూర్ చెక్‌పోస్ట్ నుంచి నడుపనున్నట్లు ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు ఎ.అన్బళగన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ జిల్లాలకు వెళ్లే బస్సులు కోయంబేడు సమీపంలో ట్రావెల్స్ సంస్థల డిపో, పోరూర్ చెక్‌పోస్ట్ నుంచి మద్రాసు హైకోర్టు ఇదివరకే అనుమతించిన ప్రకారం బస్సులు నడుపనున్నామన్నారు. కోయంబేడు బస్టాండ్ నుంచి ఈసీఆర్ మార్గంగా పుదుచ్చేరి, పూందమల్లి మార్గంగా కృష్ణగిరి, బెంగళూరు వైపు వెళ్లే బస్సులు నడుపుతున్నామన్నారు. కిలంబాక్కంలో ప్రభుత్వం నిర్మించిన బస్ టెర్మినల్ ఆ ప్రాంతం, ఈసీఆర్ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మాత్రమే ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ బస్టాండ్‌లో చెన్నై నుంచి బయల్దేరే అన్ని ఆమ్నీ బస్సుల్లో 20 శాతం మంది మాత్రమే కిలంబాక్కం బస్టాండ్‌లో ఎక్కుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రాష్ట్రంలో దక్షిణ జిల్లాలకు ఆమ్నీ బస్సులు కోయంబేడు, పోరూర్ చెక్‌పోస్ట్ నుంచి నడుస్తాయని అన్బళగన్ తెలిపారు.

'పిచ్చికుక్క నన్ను కరిచింది'....!

కలెక్టర్‌కు లేఖ రాసిన బాలిక

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిచ్చి కుక్క తనను కరించిందని నాగర్‌కోయిల్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక కన్నియాకుమారి జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నాగర్‌కోయిల్ ప్రాంతంలో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. పలువురు వాటి దాడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నాగర్‌కోయిల్ పుత్తేరి, గణేష్ నగర్‌కు ప్రాంతానికి చెందిన శక్తి (9) అనే బాలికపై ఇటీవల ఓ వీధికుక్క దాడి చేసింది. బాలికను తల్లిదండ్రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్లు, టీకాలు వేయించారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక కలెక్టర్‌కు రాసిన లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలైంది. ఆ లేఖలో... అమ్మ, నాగర్‌కోయిల్ పుత్తేరి పంచాయతి గణేష్ నగర్‌లో కొద్దిరోజులుగా వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ప్రతిరోజూ కుక్కలు పిల్లలు, పెద్దలపై దాడిచేయడం సర్వసాధారణంగా మారింది. రెండు రోజుల క్రితం గణేష్ నగర్ ప్రాంతంలో వెళ్తున్న నన్ను ఓ వీధికుక్క కరిచింది. నాతో పాటు పలువురిపై కుక్క దాడిచేసింది. కుక్కల బెడదతో ఆ ప్రాంత ప్రజలు ఇళ్ల నుంచి వచ్చేందుకు భయపడుతున్నారు. పుత్తేరి పంచాయతీలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతి నిర్వాహకులు, జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని బాలిక లేఖలో పేర్కొంది.

కిటికీ ధ్వంసం చేసి అరటి గెల ఎత్తుకెళ్లిన ఏనుగు


అరటి గెల ఎత్తుకెళ్తున్న ఏనుగు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేట్టుపాళయంలోని ఓ ఇంట్లో కిటికీ బద్దలుకొట్టిన అడవి ఏనుగు అరటి గెల ఎత్తుకెళ్లింది. కోవై జిల్లా మేట్టుపాళయం సమీపం సిరుముగై, చుట్టుపక్కల అటవి ప్రాంతాల్లో ఉంటున్న ఏనుగులు రాత్రి వేళల్లో సమీపంలోని గ్రామాల్లోకి ప్రవేశిస్తుంటాయి. ఈ క్రమంలో, ఆదివారం రాత్రి వేడర్ కాలనీలోకి ప్రవేశించిన ఏనుగు, ఓ ఇంటి సమీపంలోకి వచ్చింది. ఏనుగును చూసిన ఇంటి యజమాని పరుగులు తీశాడు. ఏనుగు ఇంటి కిటికీ బద్దలు కొట్టి, ఇంట్లో ఉంచిన అరటి గెలను ఎత్తుకెళ్లింది. ఈ దృశ్యాలను కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

హోల్‌సేల్ వ్యాపారులకు ఆవిన్ ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో హోల్‌సేల్ వ్యాపారం చేయాలనుకొనే వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆవిన్ తెలిపింది. అశోక్ నగర్, పోరూర్, పూందమల్లి, అడయార్, మైలాపూర్, అన్నానగర్, పెరంబూర్, మనలి, కొళత్తూర్, పాలవాక్కం, కిలంబాక్కం, ఆవడి, అంబత్తూర్, తిరువొత్తియూర్, అయనావరం, ఉత్తర చెన్నై, వాషర్‌మెన్‌పేట, వెప్పేరి, వేళచ్చేరి, మేడవాక్కం, అన్నాసాలై, టి.నగర్, ట్రిప్లికేన్ తదితర ప్రాంతాలు, పల్లావరం, తాంబరం, మరైమలై నగర్, చెంగల్పట్టులలో హోల్‌సేల్ వ్యాపారులను ఆవిన్ నియమించనుంది. వారికి పెరుగు, పన్నీర్, పాల ఉత్పత్తులు విక్రయించేందుకు అనుమతించనున్నారు. అందుకు డిపాజిట్‌గా రూ.50వేలు చెల్లించాలి. వేసవి సీజన్ (ఫిబ్రవరి నుంచి జూలై వరకు)లో ప్రతిరోజు కనిష్టంగా 2వేల లీటర్లు, వర్షాల సీజన్ (ఆగస్టు నుండి జనవరి వరకు)లో ప్రతిరోజు కనిష్టంగా వెయ్యి లీటర్ల ఆవిన్ పెరుగు ప్యాకెట్లు కొనుగోలు చేయాలి. విక్రయదారులకు 25 నుంచి 30 శాతం కమిషన్ అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు 9566860286 అనే నెంబరు సంప్రదించవచ్చు.

సముద్రంలో మునిగిన పడవ

● ఏడుగురు జాలర్లు సురక్షితం

ఐసిఎఫ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నూర్ సముద్రంలో పడవ హఠాత్తుగా మునిగిపోవడం కలకలం రేపింది. పడవలో రంధ్రం ఏర్పడి నీరు లోపలికి వస్తున్న సమయంలో అందులోని ఏడుగురు జాలర్లు నీళ్లలో దూకి ఈదుకుంటూ తీరానికి చేరుకున్నారు. మునిగిన పడవను మరో పడవ సహాయంతో కాశిమేడు ప్రాంతానికి జాలర్లు చేర్చారు.

మదురై కలెక్టరేట్ ఎదుట ధర్నా

టంగ్‌స్టన్ తవ్వకాలకు నిరసనగా


ధర్నాలో పాల్గొన్న హరిట్టాపట్టి తదితర గ్రామాల రైతులు, మహిళలు

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపంలోని హరిట్టాపట్టి పరిసర గ్రామాల్లో టంగ్‌స్టన్ తవ్వకాలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం హిందూస్థాన్ జింక్ సంస్థకు అనుమతించడాన్ని ఖండిస్తూ సోమవారం ఉదయం మదురై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆ గ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించారు. హరిట్టాపట్టి, మత్తువేల్‌పట్టి, కిడారిపట్టి, ఎట్టిమంగళం, చెట్టియార్‌పట్టి, నాయక్కర్‌పట్టి, వెళ్లాలపట్టి సహా 50కి పైగా గ్రామాలకు చెందిన ప్రజలు వారం రోజులుగా పలు ఆందోళనలు జరుపుతున్నారు. టంగ్‌స్టన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మేలూరు ప్రాంతానికి చెందిన రైతులు, వ్యాపారులు కూడా బంద్ చేపట్టారు. ఈ నేపథ్యంలో టంగ్‌స్టన్ ప్రాజెక్టు వ్యతిరేక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులు, మహిళలు సహా సుమారు 500 మంది కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళన కారణంగా కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసుబలగాలను మరింతగా మోహరించి భద్రతను పెంచారు.

నీటమునిగి అన్నాతమ్ముళ్ల మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలో నీటమునిగి అన్నాతమ్ముడు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తిరుపత్తూర్ ప్రాంతానికి చెందిన సుందరపాండ్యన్-విజయలక్ష్మి దంపతులకు విష్ణు (13), హరికృష్ణ (9) అనే కుమారులున్నారు. కుటుంబ కలహాల కారణంగా విజయలక్ష్మి తన ఇద్దరు కుమారులతో వేరుగా జీవిస్తూ కూలి పనులకు వెళ్తోంది. విష్ణు, హరికృష్ణ అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 7,4వ తరగతులు చదువుతున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇద్దరూ సమీపంలోని సెల్వి నారాయణ పెరుమాళ్ ఆలయ కొలనుకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. హఠాత్తుగా ఇద్దరూ లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. చుట్టుపక్కల వారి సమాచారంతో అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పోలీసులు, కొలనులో గాలించి పిల్లల మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఒకే రోజు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు రోజుల్లో కొండ రోడ్డు పునరుద్ధరణ


పనులు చేపట్టిన దృశ్యం (పక్క చిత్రంలో) రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా ధర్మపురి జిల్లా చిత్తేరి కొండల్లో భారీవర్షం కురిసింది. దీంతో, కొండ ప్రాంతం నుంచి మట్టి చెరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. 80 అడుగుల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో 63 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించిన రహదారుల శాఖ అధికారులు మూడు రోజుల్లో మరమ్మతులు చేపట్టడంతో సోమవారం నుంచి వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

మహిళా ప్రోత్సాహక నిధి పథకం

1.27 లక్షల మంది లబ్ధిదారుల తొలగింపు

పెరంబూర్, డిసెంబరు 9: కలైంజర్ మహిళా ప్రోత్సాహక నిధి పథకం నుంచి సుమారు 1.27 లక్షల మందిని తొలగించారు. ఈ విషయమై సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం బదులిస్తూ...ఈ పథకంలో లబ్ధిదారుల జాబితాలో మార్పులు చేపట్టామని, గత అక్టోబరు వరకు మార్పులు చేసిన జాబితా ప్రకారం, ఈ పథకంలో లబ్ధిదారులు 1.15 కోట్ల నుంచి 1.14 కోట్ల తగ్గారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ప్రారంభించిన ఈ పథకంలో ఇప్పటివరకు సుమారు 1.27 లక్షల మంది లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించాము. ఈ పథకంలో మృతిచెందిన వారు, అధిక ఆదాయం పొందుతున్న వారు, భూములున్న వారు, ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న వారు తదితర కారణాలతో పేర్లు తొలగించాము. ఈ పథకంలో గత అక్టోబరు నెలలో రూ.1,140 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు ప్రభుత్వ తెలిపింది.

తుపానుకు దెబ్బతిన్న గుమ్మడి



పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాల కారణంగా కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేటలోని పొలాల్లో భారీగా వరద నీరు చేరింది. ఈ పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న బూడిద గుమ్మడికాయలు వర్షపు నీటిలో నాని పనికికాకుండా పోయాయి. ఎకరాకు రూ.80 వేలు వెచ్చించి సాగుచేశామని, ప్రస్తుతం ఈ ప్రాంతంలోని 120 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతినిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగల దుకాణంలో భారీ చోరీ


దుకాణం వెనుక వేసిన రంధ్రం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగలు దుకాణంలో ప్రవేశించిన అగంతకులు రూ.10 లక్షల విలువైన నగలు దోచుకెళ్లారు. సేలం జిల్లా తలవాయిపట్టి గ్రామానికి చెందిన కార్తీక్ నగల దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి యథావిధిగా దుకాణానికి తాళం వేసి కార్తీక్ ఇంటికెళ్లాడు. ఉదయం దుకాణానికి వచ్చి చూడగా, దుకాణంలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందాడు. 6 కిలోల వెండి, 46 గ్రాముల బంగారు నగలు అదృశ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణాన్ని చేరుకొని పరిశీలించి, వెనుక వైపు గోడకు రంధ్రం వేసిన అగంతకులు లోపలికి పాల్పడ్డారని నిర్ధారించి పోలీసు జాగిలంతో అగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

కోలాహలంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు


విజేతలతో నిర్వాహకులు

వేలూరు, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫిల్టర్ బెడ్ రోడ్డులో ఉన్న ఉపాధ్యాయుల హోంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిషప్ డా.కాలేబు కన్నదాసన్, సెక్రటరీ విల్సన్ సాముయేలు, జనరల్ సెక్రెటరీ డా. రబిదేశన్, ఉపాధ్యక్షులు కుట్టి సాముయేలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ వింగ్ అధ్యక్షుడు నందకుమార్, అన్బుకుమార్, పవన్‌కుమార్, వేలూరు జాకబ్ జోసఫ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కామరాజర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

వేలూరు, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): పర్నాంబట్టు సమీపంలో కోట్టై కాలనీలో కామరాజర్ శిక్షణా కేంద్రం ప్రారంభమైంది. ఈ ప్రాంతంలోని విద్యార్థులు, యువకులు క్రీడా శిక్షణ పొందేలా ఆర్.ఆదిత్య ట్రస్ట్ ఆర్గనైజర్ అరవింద్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ వళ్లువన్ కేంద్రానికి క్యారమ్ బోర్డు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ హక్కుల ఆర్గనైజర్ ఎల్. మణి సహా పలువురు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లలో 1,126 పార్ట్‌టైమ్ రేషన్ షాపులు

● అసెంబ్లీలో మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత మూడున్నరేళ్లలో 1,126 పార్ట్‌టైమ్ రేషన్ షాపులను ప్రారంభించినట్లు మంత్రి పెరియకరుప్పన్ సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో తెలియజేశారు. అసెంబ్లీ తొలిరోజు సమావేశంలో పలువురు సభ్యులు కొత్తరేషన్ షాపుల ప్రారంభంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలో గత మూడున్నరేళ్లలో 544 కొత్తరేషన్ షాపులు, 1,126 పార్ట్‌టైమ్ కొత్తరేషన్ షాపులతో పాటు మొత్తం 1,670 రేషన్ షాపులను ప్రారంభించినట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు.. తప్పిన ప్రమాదం



తిరుత్తణి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ప్రయాణికులు అదృష్టవశాత్తు బయటపడిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి పొదటూరుపేట వెళ్తున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

యధార్థ సంఘటనతో 'ఫైర్'



ఆడియో రిలీజ్ దృశ్యం

బాలాజీ మురుగదాస్, రచితా మహాలక్ష్మి, సాక్షి అగర్వాల్, గాయత్రి షాన్, చాందిని తమిళరసన్ తదితరులు నటించిన ఫైర్ .. యధార్థ సంఘటనతో తెరకెక్కించినట్టు ఆ చిత్ర దర్శకుడు జేఎస్‌కే వెల్లడించారు. నిర్మాత, నటుడైన జేఎస్‌కే దర్శకుడిగా మారి తొలిసారి జేఎస్‌కే ఫిలిమ్స్ కార్పొరేషన్ పతాకంపై రూపొందించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. తమిళ సినీ నిర్మాతల సంఘం అధ్యక్షుడు రామస్వామి ఎస్.మురళి, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, నిర్మాత టి.శివ, సీనియర్ నటుడు పాండిరాజన్, ముఖ్య అతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఆడియో రిలీజ్ సందర్భగా దర్శకుడు జేఎస్‌కే మాట్లాడుతూ, 'గతంలో రాష్ట్రాన్ని కుదిపేసిన యధార్థ సంఘటనతో రూపొందిన చిత్రం. నలుగురు యువతుల స్టోరీ. దీనిని ఒక అవగాహనా చిత్రంగా కూడా భావించవచ్చు. పోలీస్ అధికారిగా నటించాను. సినిమా కాపీ సిద్ధమైన వెంటనే మహిళలకు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక షో ప్రదర్శించి వారి అభిప్రాయాలను కూడా సేకరించాం. విడుదల తేదీని ఖరారు చేసి త్వరలోనే రిలీజ్ చేస్తాం' అని పేర్కొన్నారు.

అవమానాలు భరించాల్సిందే

● వాణీ భోజన్



నటించేందుకు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టామని, ఇక్కడ ఎదురయ్యే అవమానాలన్నీ భరించాల్సిందేనని హీరోయిన్ వాణీ భోజన్ అన్నారు. నగరంలో ఇటీవల జరిగిన ఓ సినీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, 'నా ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్నారు. ఆ హీరోతో సంబంధం ఉంది.. ఈ హీరోతో లింకుందంటూ అసత్య ప్రచారం చేస్తూ ట్రోల్స్ చేస్తున్నారు. ఇవి ఎంతో మనోవేదనకు గురిచేస్తున్నాయి. కానీ, నటించేందుకు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాం. సో.. ఇలాంటివన్నీ భరించాల్సిందేనని నేను వదిలివేశాను. నాతో నటించిన కొందరు నటులతో కలిసి సన్నిహితంగా మెలిగినా, మాట్లాడినా, వారితో కలిసి ఎక్కడికైనా వెళ్ళినా ఏవేవో సంబంధాలు అంటగట్టేస్తున్నారు. నా పక్కన నిల్చొన్న ఓ ఫొటోగ్రాఫర్‌ను నన్ను కలిపి మరోలా మాట్లాడారు. మా ఇద్దరికి వివాహం జరిగినట్టుగా ప్రచారం చేశారు. ఇన్‌స్టా ఖాతాలో నేను షేర్ చేసే ఫొటోలను చూసి... పొట్టి దుస్తులు ధరిస్తే అవకాశాలు పెరుగుతాయా? అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఆ ఫొటోలను మరోలా మార్ఫింగ్ చేసి, వాటిని వైరల్ చేస్తున్నారు. ఒకరిని ట్రోల్ చేయడంలో తప్పు లేదు. కానీ, దానికి ఓ హద్దు ఉంది. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు హీరోలకు ఎదురుకాదు. కేవలం హీరోయిన్లు మాత్రమే బాధితులు. సీరియల్స్‌లో నటించిన వారు చిత్రాల్లో నటించరంటూ కామెంట్స్ చేశారు' అంటూ తన మనవేదన వ్యక్తం చేశారు.

'సూర్య-45' నుంచి తప్పుకున్న రెహ్మాన్!



ఆర్జే బాలాజీ దర్శకత్వంలో హీరో సూర్య నటించనున్న 45వ చిత్రం నుంచి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ తప్పుకున్నారు. ఆయన స్థానంలో మాలీవుడ్ యువ సంగీత దర్శకకుడు సాయి అభియంకర్‌ని ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఓ పోస్టర్‌లో మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి పనిచేసే నటీనటులు, టెక్నీషియన్ల పేర్లను ఒక్కొక్కరిగా ప్రకటిస్తున్నారు. ఈ కోవలోనే సినిమాటోగ్రాఫర్‌గా జీకే విష్ణును ఎంపిక చేసినట్టు రిలీజ్ చేసిన పోస్టరులో ఏఆర్ రెహ్మాన్ పేరు లేదు. అపుడే పలు సందేహాలు వచ్చాయి. వీటిని నిజం చేస్తూ తాజాగా రెహ్మాన్ స్థానంలో సాయి అభియంకర్‌ను తీసుకున్నట్టు ప్రకటించారు. కాగా, రెహ్మాన్ నుంచి విడిపోతున్నట్టు ఆయన భార్య సైరా బాను ఇటీవల ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో తీవ్రంగా కలత చెందిన రెహ్మాన్... ఒక యేడాది పాటు సంగీత ప్రపంచానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు వార్తలు రాగా, ఈ ప్రచారాన్ని ఆయన కుమార్తె ఖతీజా, కుమారుడు అమీన్ ఖండించారు కానీ, సూర్య-45 నుంచి తప్పుకోవడంపై ఆసక్తికర చర్చ సాగుతుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

చిత్రజ్యోతి

హీరోతో తలపడనున్న ఆరుగురు విలన్లు



'పడైయాండ మావీర'లో ఓ దృశ్యం

వీకే ప్రొడక్షన్స్ గ్రూపు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రం 'పడైయాండ మావీర'. స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా వి.గౌతమన్ నటించారు. 'కనవే కలైయాదే', 'మగిళ్చి' వంటి హిట్ చిత్రాల తర్వాత గౌతమన్ హీరోగా నటిస్తున్నారు. భూమిని, ప్రజలను రక్షించేందుకు ధైర్యంగా ధర్మంగా పోరాడిన వీర సైనికుడికి సంబంధించిన రియల్ స్టోరీ. ఇందులో గౌతమన్‌నకు ప్రతినాయకులుగా మన్సూర్ అలీఖాన్, 'ఆడుగలం' నరేన్, 'బాహుబలి' ప్రభాకర్, 'వేదాళం' కబీర్, మధుసూదన రావు, దీనా నటించారు. ఇతర పాత్రల్లో సముద్రఖని, శరణ్య, రెడిన్ కింగ్‌స్లీ, నిళల్‌గల్ రవి, ఇలవరసు, తమిళ్ గౌతమన్, తలైవాసల్ విజయ్, ఏఎస్ అళగప్పన్ తదితరులు నటించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'నాకు ఓ జీవిత లక్ష్యముంది. ఎర్రచందనం అడవులు, జీడి తోటలు తమిళుల చరిత్రకు విడదీయరాని బంధం ఉంది. ఈ అడవుల్లో జీవించిన పోరాట యోధుల చరిత్రను రూపొందించి ప్రపంచానికి ఓ దార్శనికతగా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అందులోభాగంగానే ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఈ సినిమా కోసం 76 రోజుల పాటు షూటింగ్ పూర్తి చేశాం. ఇపుడు తుదిదశ చిత్రీకరణ పనులు చేస్తున్నాం' అని వివరించారు.

మహాదీపం రోజున పర్వతారోహణకు అనుమతి వద్దు!

● ప్రభుత్వానికి ఐఐటీ నిపుణుల కమిటీ సిఫారసు



అరుణాచల పర్వతం

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం అరుణచలేశ్వరాలయంలో ఈ యేడాది కార్తీక మహాదీపోత్సవం రోజు భక్తులు ఆలయం వెనుకవైపున్న అరుణాచల పర్వత శిఖరాగ్రానికి వెళ్లేందుకు అనుమతించవద్దని ఐఐటీ నిపుణుల కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. మహాదీపాన్ని వెలిగించే కొండపైనుంచి ఇటీవల వర్షాలకు మట్టిచరియలు, బండరాళ్లు దొర్లి కొండ నున్న ఓ పెంకుటింటిపై పడటంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సహా ఏడుగురు దుర్మరణం చెందారు. ఈ సంఘటన దరిమిలా మహాదీపం రోజున కొండపై దీపాన్ని వెలిగించే సమయంలో ఎప్పటిలాగే 2500 మంది భక్తులను అనుమతించాలా? వద్దా? అనే విషయమై రెండు రోజులుగా ఐఐటీ మద్రాసు సాంకేతిక నిపుణులు కొండపైకి వెళ్లే కాలినడక దారి పటిష్ఠత పరిశీలించారు. ఆ తర్వాత దేవాదాయ శాఖకు నివేదిక అందజేశారు. ఇటీవలి వర్షాలకు కొండపై కాలినడక దారి ఇంకా గట్టిపడలేదని, పలుచోట్ల నేల బురదగా ఉందని, ఈ పరిస్థితుల్లో భక్తులను కొండపైకి వెళ్లేందుకు అనుమతించకపోవడమే మేలని ఆ నివేదికలో పేర్కొన్నారు. మహాదీపం వెలిగించేందుకు కొండపైకి వెళ్లే మార్గంలో 990 హెక్టార్ల విస్తీర్ణం వరకు నేల పూర్తిగా తేమగా ఉందని, ఈ పరిస్థితుల్లో కొండపైకి భక్తులను అనుమతించకుండా మహాదీపానికి సంబంధించి వంశపారంపర్యం వత్తులు, నెయ్యి, కాటా గుడ్డలను తీసుకెళ్లే కార్మికులను, ఆలయ సిబ్బందిని మాత్రమే అనుమతించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఓ అధికారిక ప్రకటనను జారీ చేయనుంది.

పానగల్ పార్కు దిగువన మెట్రో రైల్వేస్టేషన్



పానగల్ పార్కు వద్ద జరుగుతున్న మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణపనులు

టినగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై లైట్‌హౌస్ - పూందమల్లి మెట్రో రైలు మార్గంలో టినగర్ పానగల్ పార్కు వద్ద భూఉపరితలం నుంచి 16 మీటర్ల లోతున బ్రహ్మాండమైన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. చెన్నై రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు 116 కి.మీ. మేర మూడు మార్గాల్లో చేపడుతున్న విషయం తెలిసిందే.ఆమూడు మార్గాల్లో ఒకటైన లైట్‌హౌస్- పూందమల్లి (26 కి.మీ.లు) మార్గంలో లైట్‌హౌస్ నుండి కోడంబాక్కం ఫ్లైఓవర్ వరకు సొరంగ మార్గంలోను, కోడంబాక్కం పవర్‌హౌస్ నుండి పూందమల్లి వరకు స్తంభాల మీద నిర్మించే మార్గంలోను మెట్రోరైళ్లు పరుగులు తీయనున్నాయి. ఈ మార్గంలో 9 సొరంగ మెట్రో స్టేషన్లు, ఉపరితల రైలు మార్గంలో 18 చోట్ల మెట్రోరైల్వేస్టేషన్లు నిర్మిస్తున్నారు. ఆ మేరకు పానగల్ పార్కు సొరంగ మెట్రోరైల్వేస్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ విషయమై చెన్నై మెట్రోరైలు సంస్థ ఉన్నతాధికారులు మాట్లాడుతూ చెన్నైలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనుల్లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భారీ యంత్రాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రాలను ఉపయోగించడం వల్ల నిర్మాణానికి ఉపయోగించే స్థల విస్తీర్ణం తక్కువగా ఉంటుందన్నారు. ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో రావడానికి వీలున్న ప్రాంతాల్లో మెట్రో రైల్వేస్టేషన్‌ను విశాలంగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. లైట్‌హౌస్ - పూందమల్లి మార్గంలోని పానగల్ పార్కు వద్ద ప్రాథమిక స్థాయి పనులన్నీ పూర్తయ్యాయని, ప్రస్తుతం మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని వివరించారు. భూ ఉపరితలం నుంచి 16 మీటర్ల లోతున 230 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో బ్రహ్మాండమైన మెట్రోరైల్వేస్టేషన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రైల్వేస్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఉంటాయని, ప్రయాణికులను ఆకట్టుకునేలా సర్వాంగ సుందరంగా ఈ స్టేషన్ నిర్మిస్తున్నామని, ఇప్పటికే 20 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే యేడాది మే లోపున పానగల్ పార్కు రైల్వేస్టేషన్ సిద్ధంగా ఉంటుందని ఆ అధికారులు పేర్కొన్నారు.

పాంబన్ లైట్ హౌస్ సందర్శనకు అనుమతి



పాంబన్ లైట్ హౌస్ వద్ద పర్యాటకులు

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం పాంబన్ లైట్ హౌస్ సందర్శనకు 33 ఏళ్ల అనంతరం అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1846లో ఐరోపియన్లు 106 మెట్లతో 100 అడుగుల ఎత్తున పాంబన్ లైట్ హౌస్ నిర్మించారు. 1991వ సంవత్సరంలో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకు గురైన నేపథ్యంలో, భద్రతా కారణాల రీత్యా ఈ లైట్ హౌస్ మూసివేశారు. ఈ లైట్ హౌస్ చుట్టుపక్కల పిల్లల పార్క్ సహా ఆహ్లాదకరమైన సదుపాయాలతో ఆధునీకీకరించారు. సోమవారం మినహా వారంలో మిగిలిన అన్ని రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలు పర్యాటకులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

11న స్మార్ట్ ఇండియా హాకథాన్

చెన్నై, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (హెచ్‌జీఐ) అనుబంధ కళాశాలలైన కేసీజీ టెక్నాలజీ కాలేజీ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో స్మార్ట్ ఇండియా హాకథాన్ - 2024 నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ అన్నీ జాకబ్ తెలిపారు. కారపాక్కంలోని కళాశాలలో నిర్వహించే ఈ హాకథాన్‌లో దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన 120 మంది విద్యార్థులతో కూడిన 22 బృందాలు పాల్గొంటాయని చెప్పారు. ఏఐసీటీఈ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంతి ధర్మేంద్ర ప్రధాన్ వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ డీజీపీ డాక్టర్ కే రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా, లండన్‌లోని ఐఈటీ ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజర్ జేమ్స్ హావి విశిష్ట అతిథిగా పాల్గొంటారని ఆయన వివరించారు.

వృషభ వాహనంపై అన్నామలైయార్



ప్రత్యేక వాహనాల్లో విహరిస్తున్న ఉత్సవమూర్తులు



వేలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం ఉత్సవమూర్తులు వివిధ రకాల వాహనాల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వినాయకుడు, చంద్రశేఖరుడు మూషికా వాహనం, అద్దాల వృషభ వాహనంలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు విహరించారు. వీరి వెనుకగా చండికేశ్వరుడు, పరాశక్తి అమ్మవారు, వల్లి, దేవసేన సుబ్రమణ్యస్వామి కొలువు దీరిన వాహనాలు సాగాయి. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని, ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

పూందమల్లి-పోరూర్ మధ్య 90 శాతం పూర్తయిన మెట్రోరైలు పనులు

● వచ్చే ఏడాది డిసెంబరులో అందుబాటులోకి!

పెరంబూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి-పోరూర్ మధ్య చేపట్టిన మెట్రోరైలు పనులు 90 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. నగరంలో రెండో విడత మెట్రో రైలు పథకం పనులు 116.1 కి.మీ మేర మూడు మార్గాల్లో జరుగుతున్నాయి. వీటిలో లైట్ హౌస్-పూందమల్లి మధ్య 26.1 కి.మీ రైలు మార్గం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మార్గంలో పూందమల్లి-పోరూర్ మధ్య మెట్రోరైలు మార్గం పనులు 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి వంద శాతం పనులు పూర్తిచేసి, మార్చి-ఏప్రిల్ నెలల్లో 90 కి.మీ వేగంతో మెట్రోరైలు నడుపనున్నారు. అనంతరం ఈ మార్గంలో మరిన్ని ప్రయోగాత్మక రైళ్లు నడిపి, 2025వ సంవత్సరం డిసెంబరులో ఈ మార్గంలో మెట్రో రైళ్లు ప్రజల అందుబాటులోకి వచ్చే అవకాశముందని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు.



శాసనసభలో టంగ్‌స్టన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రత్యేక తీర్మానంప్రతిపాదించి ప్రసంగిస్తున్న నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్



సచివాలయంలో స్పీకర్ అప్పావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల్లో భాగంగా 'శాసనసభా నాయకుడు - కలైంజర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మంత్రి దురైమురుగన్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఆహ్లాదకరంగా కార్తీక వనభోజనాలు



గీతా పారాయణం చేస్తున్న భక్తులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓల్డ్ వాషర్‌మెన్‌పేట బసవయ్య వీధిలో శ్రీకృష్ణ గీతా సమాజం ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కపిల వినాయక దేవస్థానంలో పూజలు చేశారు. ఇందులో పాల్గొన్న సమాజ సభ్యులందరూ గీతా పారాయణ హోమం జరిపారు. సమాజ నిర్వాహకులు జగదీశ్వరయ్య, మనోహర్, రాధ, ఆలయ ధర్మకర్త రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత కోలాహలంగా కార్తీక వనభోజనాలు చేశారు.

27 నుంచి చెన్నై పుస్తక ప్రదర్శన

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత పుస్తక ముద్రణ, విక్రయదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి నగరంలో చెన్నై పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. ఇదే విషయంపై ఆ సంఘం అధ్యక్షుడు చొక్కలింగం, కార్యదర్శి మురుగన్ సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన జనవరి 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు 900 ముద్రణా సంస్థలు ముందుకొచ్చాయన్నారు. ఇందులో దేవాదాయ శాఖకు చెందిన ఆధ్యాత్మిక పుస్తక స్టాల్ కూడా ఉంటుందన్నారు. గత యేడాది నగరంలో నిర్వహించిన 47వ పుస్తక ప్రదర్శనలో దాదాపు 20 లక్షల మంది సందర్శకులు తిలకించారన్నారు. ఈ యేడాది ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

చినారులకు వినికిడి పరికరాలు



వినికిడి పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అడయార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త అప్సర రెడ్డికి చెందిన గుడ్ డీడ్స్ క్లబ్ 30 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను అంద జేశా రు. ప్రఖ్యాత ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ మోహన్ కామేశ్వరన్‌తో కలిసి, వినికిడి లోపం ఉన్న 30 మంది చిన్నారులకు గివింగ్ ది గిఫ్ట్ ఆఫ్ సౌండ్ కింద 30 హైక్వాలిటీ వినికిడి పరికరాలను సోమవారం అందించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మనలో వినగల సామర్థ్యం చాలా మందికి చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఇలాంటి వారికి తమ సంస్థ తరఫున ఆదుకునేలా హైక్వాలిటీ వినికిడి పరికరాలను డాక్టర్ మోహన్ సహకారంతో అందించడం సంతోషంగా ఉందన్నారు.



మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు ఉత్సవాల్లో వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాల, కళాశాల విద్యార్థులకు సచివాలయంలో నగదు బహుమతులు అందజేస్తున్న సీఎం స్టాలిన్

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలపైనే 108 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వికృతమాల హౌసింగ్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వికృతమాల హౌసింగ్ కాలనీవాసులు

ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని హౌసింగ్ కాలనీలో కనీస వసతులు కల్పించాలని వికృతమాల ప్రభుత్వ గృహాల అభివృద్ధి కమిటీ నేతలు శివయ్య, గోవర్ధన్, పుష్పరాజ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందని, వీధి దీపాలు లేవని, చీకటిపడితే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఏనుగుల నుంచి రైతులను కాపాడండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న రామానాయుడు

ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం అందించారు. పది రోజులుగా 17 ఏనుగులు గుంపుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి, పలమనేరు, వి.కోట, గంగవరం మండలాల్లో ఏనుగులు స్వైర విహారం చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, పద్మనాభరెడ్డి, రైతు మల్లికార్జున పాల్గొన్నారు.

అటకెక్కిన శిల్పారామం మాస్టర్‌ప్లాన్



శిల్పారామం ముఖద్వారం - స్టాల్స్, హట్స్

- అభివృద్ధి కోసం 2019లో రూ.10 కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం
- కక్షతో నిధులను రద్దు చేసిన జగన్ ప్రభుత్వం
- ఆదాయం పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు

శిల్పారామం అభివృద్ధికి పదికోట్ల రూపాయలతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ముందుకు కదలడం లేదు. ఏటా సందర్శకుల సంఖ్య, ఆదాయం పెరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉరుకుల పరుగుల జీవనంలో నగరవాసులకు కాసింత సేదతీర్చేందుకు పట్నంలో పల్లె అనుభూతి కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 22 ఏళ్ల క్రితం తిరుచానూరు రోడ్డులో శిల్పారామం (అర్బన్‌హాట్)ను ఏర్పాటు చేశాయి. అప్పటి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కాశీరామ్ రాణా చేతుల మీదుగా 16 ఎకరాల ప్రాంగణంలో మట్టి బొమ్మల సోయగాలు, పల్లె సొగసులను హత్తుకునేలా అర్బన్ హట్ ప్రారంభమైంది. భారతీయ సంప్రదాయ కళలు నేటి తరానికి అందించడానికి శిల్పారామంలో అనేక కళా, వస్తు ప్రదర్శనలు ఉన్నాయి. ప్రారంభ రోజుల్లో 150 మంది సందర్శకులు మాత్రమే వచ్చేవారు. నేడు ఆ సంఖ్య 900 మందికి చేరింది. శని, ఆదివారాల్లో ఈ సంఖ్య పెరుగుతోంది. తద్వారా ఆదాయమూ పెరుగుతూ వచ్చింది.

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ఇవే

శిల్పారామం (అర్బన్‌హట్)లో సందర్శకుల కోసం మరిన్ని సౌకర్యాలు సమకూర్చడానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షతో ఈ కేటాయింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల ఫలితంగా ఎట్టకేటకు 2020 అక్టోబరులో జగన్ ప్రభుత్వం తిరిగి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులు చేపట్టేందుకు అనుమతించింది. మాస్టర్‌ప్లాన్‌ను ఓ ప్రైవేట్ ఆర్కిటెక్ సంస్థచే రూపొందించారు. ఈ ప్రతిపాదనలో ఆర్చీతో కూడిన ప్రవేశ ద్వారం వద్ద ప్లాజా నిర్మాణం, సందర్శకుల సౌకర్య కేంద్రాలు, వాటర్ ఫౌంటెన్, కళాత్మకమైన గ్రామీణ వాతావరణంతో వివిధ రకాల స్టాళ్ల ఏర్పాటు, చేతి వృత్తులు, కళాకారులకు శిక్షణ కేంద్రం, ఎంపోరియం, వివిధ స్మారక చిహ్నాలతో కూడిన దుకాణాలు, ఫుడ్‌కోర్టు, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఆధునికీకరణ లాంటి పనులకు ఈ నిధులను వ్యయం చేయాల్సి ఉంది. గడచిన నాలుగేళ్ల వైసీపీ పాలనలో శిల్పారామం మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆ పది ఎకరాలపై దృష్టి పెట్టండి

శిల్పారామం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో మరో పది ఎకరాలను కేటాయించడానికి అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అంగీకరించారు. అందులో బోన్సాయ్, బటర్‌ఫ్లై, రాక్ గార్డెన్స్ ఏర్పాటుకు శిల్పారామం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ స్థలాన్ని సైతం వైసీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నించారు.



కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

స్థానికులకు మానసికోల్లాసం అందించడమేగాక ఏడాదికి సుమారు రూ.2 కోట్లు ఆదాయం వస్తున్న శిల్పారామంలో మాస్టర్‌ప్లాన్ పనులు వేగవంతం చేసి, కొత్త సొబగులు దిద్దితే సందర్శకుల సంఖ్యతోపాటూ జిల్లా పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీసిటీని సందర్శించిన హిరోషిమా ప్రతినిధుల బృందం



శ్రీసిటీలో ప్రతినిధుల బృందం

శ్రీసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులు, వైవిధ్య భరితమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, వ్యాపార అనుకూల వాతావరణంలో నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని హిరోహరు సకనే నేతృత్వంలోని బృందం అభినందించింది. జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 30పైగా జపనీస్ పరిశ్రమల స్థాపనతో భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ గుర్తింపు పొందిందని వారికి వివరించారు. పర్యటనలో పాల్గొన్న ప్రతినిధులు శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి విపులంగా అడిగి తెలుసుకున్నారు. హిరోషిమా అధికార ప్రతినిధుల బృందం పర్యటనపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత్, హిరోషిమా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా ఆయన పేర్కొన్నారు. ప్రతినిధుల బృందంలో హిరోషిమా ప్రభుత్వ అధికారి యుదై హరున్, హిరోషిమా బ్యాంక్ లిమిటెడ్ అధికారులు తకుషి కొసాకా, హిరోకి ఒనిషి తదితరులు పాల్గొన్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్టు



నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్టణం నుంచి నాయుడుపేటకు గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సోమవారం మీడియాకు వెల్లడించారు. నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, వెంకటేష్, చక్రవర్తి, నాయుడుపేట పట్టణానికి చెందిన వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మకు గంజాయిని సరఫరా చేస్తుంటారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు నిఘా వేశారు. గంజాయి విక్రయిస్తున్న వెంకటేష్, చక్రవర్తి, వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 25 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షల విలువ ఉంటుందని చెప్పారు. కాగా, నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, పరారయ్యారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనపరచిన అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు భవానీ లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది నాగూరయ్య, రామమోహన్‌రాజు, సాహుల్, భానుతేజ, పోలయ్య, మురళి, షాహిదా, చందన, సుప్రజను డీఎస్పీ అభినందించారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పరిశీలన

తిరుపతి(మంగళం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనర్హత పింఛన్ల ఏరివేతకు రూపొందించిన పైలెట్ కమిటీ ప్రాజెక్ట్ పరిశీలన మంగళవారంతో ముగియనుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పరిశీలనలలో 15 అనర్హత పింఛన్లను గుర్తించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామపంచాయతీ, వార్డు సెక్రటేరియట్ పరిధిలో పింఛనుదారుల వ్యక్తిగత పరిశీలన కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోన వార్డు సచివాలయ పరిధిలో 355 పింఛనుదారులకు గాను 322 పరిశీలించామన్నారు. సోమవారం పరిశీలన ముగిసే సమయానికి 32 మందిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ 32 మందిలో ఒకరు మరణించారని, 31 మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారన్నారు. మంగళవారం తనిఖీ ప్రారంభయమ్యే సమయానికి వారి చిరునామా గల నివాసాల వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ పింఛనుదారుల పరిశీలనలో శ్రీకాళహస్తి డీఎల్‌డీవో సుస్మితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధిక, పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా నమోదు ప్రారంభం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జిల్లాలో మామిడి పంటకు బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఉద్యానశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2024-25 రబీసీజన్‌కు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సమీపంలోని బ్యాంకులలోగాని లేదా మీసేవ, బీమా కంపెనీ నియమించిన వారి ద్వారానైనా ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, భూమిపాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను అందించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

- మందుబాబు తీరుతో

రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం



ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మద్యం తాగాడు. ట్రాన్స్‌ఫార్మరు వద్ద కరెంటు సరఫరా ఆపేశాడు. ఆపై దానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇతడి చర్య వల్ల శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌లో రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొదట సాధారణ అంతరాయంగా స్థానికులు భావించారు. అరగంట తరువాత తాగుబోతు పనిగా గుర్తించారు. అతడిని వెదికి పట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళాన్ని తీయమని చెబితే.. అతడు వినలేదు. తనను ప్రశ్నించిన వారిపై బూతుల దండకంతో విరుచుకుపడ్డాడు. దాడికీ యత్నించాడు. ఇలా గంటపాటు వీరంగం చేశాడు. విసిగిపోయిన స్థానికులు డిస్కం అధికారులకు, వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి మందుబాబుకు దేహశుద్ధి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం తీయించారు. మొత్తమ్మీద రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా లేకుండా చేశాడు. దీనిపై డిస్కం అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎన్టీఆర్ నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ 600 ఎకరాలు తిరిగి అప్పగించండి!

ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి అధికారుల ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించండి. నూతన పరిశ్రమల స్థాపనకు వాటిని కేటాయించడానికి అవకాశం ఉంటుంది' అని కంపెనీ ప్రతినిధులకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ సూచించారు. ఏపీఐఐసీ ఎండీ అభిషిక్తకిషోర్‌తో కలసి సోమవారం సోమవారం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, సదరు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్నవరం వద్ద ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎన్‌బీపీపీఎల్) పవర్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 2009లో భూములు కేటాయించారు. ఈ భూ అంశం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉందని ఆ కంపెనీ ప్రతినిధులు వివరించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడానికి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఐఐసీ అధికారులను యువరాజ్ ఆదేశించారు.

రేపటినుంచి ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్


డైరెక్టర్ సత్యనారాయణ



తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ప్రాంగణం ఈనెల 11 నుంచి రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు సిద్ధమవుతున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఐఐటీకి ఈ అవకాశం రావడం గర్వకారణమన్నారు. దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నాయకత్వం వహించడానికి విద్యా మంత్రిత్వశాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ ఒకటిగా గుర్తింపబడిందన్నారు. ఇదో మైలు రాయి అన్నారు. హ్యాకథాన్ ఎలైట్ టీంల కలయికకు సాక్షమివ్వనుందని అభిప్రాయపడ్డారు. ప్రతి బృందంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగులు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులు ఉంటారన్నారు. వీరు ఆయూష్ మంత్రిత్వ శాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమ్యల ప్రకటనలకు పరిష్కారం రూపొందించటానికి పోటీ పడతారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే టీంలు వారి అసాధారణమైన సమస్య-పరిష్కారం నైపుణ్యాలను వినూత్న ఆలోచనలు ఎంపిక చేయబడుతాయన్నారు. ప్రతి సమస్య ప్రకటనపై విజేతలకు భారత ప్రభుత్వం నగదు బహుమతులను అందించి సత్కరిస్తుందని తెలిపారు. యువతలో పరిశోధన, అభివృద్ధి, సంస్కృతిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే భారతదేశ విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వేదికగా మాత్రమే కాకుండా దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కొత్త తరం ఇంజనీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించటంలో తిరుపతి ఐఐటీ ముందంజలో ఉందని ఆయన అన్నారు.

అధికారులూ.. అభినందనలు





అమ్మవారి బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎక్స్‌లో సీఎం పోస్ట్

తిరుచానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం పట్ల సీఎం చంద్రబాబు సోమవారం టీటీడీని అభినందించారు. ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల దివ్య వైభవాన్ని వీక్షించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. టీటీడీ ప్రణాళికాబద్ధంగా ముందు చూపుతో ఏర్పాట్లు చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయడం వల్ల భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందేలా చేశారని సీఎం అభినందించారు.

తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు

- కర్ణాటక భక్తుడి ట్వీట్‌కు ఎక్స్‌లో మంత్రి లోకేశ్ స్పందన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'మీ తర్వాతి పర్యటనలో తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు' అంటూ శ్రీవారి భక్తుడి ట్వీట్‌కు ఎక్స్ వేదికగా స్పందించారు మంత్రి నారా లోకేశ్. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. కర్ణాటకకు చెందిన కెంచా అనే పేరుతో ఎక్స్ వేదికగా తిరుమలలోని సౌకర్యాలపై ఓ భక్తుడు ట్వీట్ చేశారు. 'గతంతో పోలిస్తే తిరుమలలో పరిశుభ్రత ఉంది. మరుగుదొడ్లతో పాటు రోడ్లు కూడా శుభ్రంగా కనిపిస్తున్నాయి. శ్రీవారి దర్శన సమయం తగ్గడంతో పాటు క్యూలైన్ నిర్వహణ, అన్నప్రసాదాలు బాగున్నాయి. లడ్డూ నాణ్యత కూడా పెరిగింది. గతంలో లడ్డూ కేవలం రుచి చూసేవాడిని. ఇప్పుడు పూర్తి లడ్డూనే తింటున్నా. ఐదురోజులు ఉంచినా తాజాగా ఉంటోంది. ఎలాంటి కొరత లేకుండా లడ్డూలు ఇస్తున్నారు. ఇక, గదుల కొరత అధికంగా ఉంది. ఉచిత బస్సులు రద్దీగా ఉంటున్నాయి' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కర్ణాటక భక్తుడైన తాను ఏపీ రాజకీయాలను పెద్దగా పట్టించుకోనని పేర్కొన్నారు. తరచూ తిరుమలకు వచ్చే భక్తుడిగానే చెబుతున్నానని తెలిపారు. 'తిరుమలలోని మార్పులను ప్రశంసించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు పరిపాలన, దార్శనికత కారణంగానే తిరుమలలో పారిశుద్ధ్యం, లడ్డూ రుచి, అన్నప్రసాదం నాణ్యత, శ్రీవారి దర్శనం మెరుగుపడ్డాయి. వసతి, ఉచిత బస్సులు వంటి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం. తర్వాతి మీ తిరుమల పర్యటనలో మరిన్ని మార్పులను చూస్తారు' అంటూ కర్ణాటక భక్తుడి ట్వీట్‌పై నారా లోకేశ్ స్పందించారు.

జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో బుధ, గురువారాల్లో సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుంది. దీనికోసం జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి' అని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధశాఖల వారీగా పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, రూ.3.58 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 73,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,721 మంది తలనీలాలు సమర్పించారు.

ముంగిలిపట్టు వద్ద అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



శ్రావణి (ఫైల్ ఫొటో)



కార్తీక్

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన శ్రావణి(23)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముంగలిపట్టు వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని యువతి మృతదేహం రక్తపు మడుగులో పడుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ అనిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద రెండు జతల చెప్పులున్నాయి. సాయంత్రం 6 గంటల సమయంలో బైక్‌పై తిరుపతి నుంచి ఓ యువకుడితో వస్తూ ఆమె ఏడుస్తూ వాదిస్తోందని కొందరు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన రవి కుమార్తె శ్రావణిగా తేలింది. తిరుపతిలో రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తోంది. ఆమెతో పాటు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కమ్మవాండ్లపల్లెకు చెందిన రామ్మూర్తి కుమారుడు కార్తీక్ కూడా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా వీరి మధ్య పరిచయం ఉంది. శ్రావణికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుస్తోంది. దీనిపై శ్రావణితో మాట్లాడేందుకు కార్తీక్ తిరుపతి నుంచి బైక్‌పై ముంగిలిపట్టుకు తీసుకొచ్చినట్టు తెలిసింది. కాగా, చంద్రగిరి జాతీయ రహదారి వద్ద కార్తీక్ ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. ఈ వాదులాట నేపథ్యంలో అతడు ఆమెను రోడ్డుపైకి తోసేశాడా లేదా శ్రావణి ఆత్మహత్య చేసుకొందా? లేక రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.